# మహా యిల్లాలు

రోశాం 'యానాది పిల్ల'. చిన్నతనంనుంచీ మా యిళ్ళలోనే పెరిగింది. అస్తమానం మా యిళ్ళలోనే ఉండేది. గుడిసెకుపోతే చుట్టపుచూపుగా ఏమన్నా పొయ్యేదేమో. మాయింట్లో, తప్పితే సీతయ్యగారియింట్లో, తప్పితే కోమటిదుకాణంమీద మరోచోటికిపోయి ఎరగదు. ఈ మూడిళ్ళలోనూ పనిచేసేది మూడిళ్ళలోనూ తిండితినేది. రాత్రిపూట ఎవరో ఒకరిపంచన పడుకునేది.

'చేసుకున్న అమ్మకు ఒకటేకూర, అడుక్కున్న అమ్మకు అన్నీకూరలే,' అనేది మా అమ్మ.

'చిన్నతనం. నిర్విచారంగావుంటుంది. ఏపని చెప్పినా ఆడుతూ పాడుతూ చేస్తుంది,' అనేది సీతయ్యగారి పెళ్ళాం.

'ఏ జన్మలోనో పాపంజేసి సూద్దరాళ్ళయి పుట్టటంగాని, అసలు అళ్ళకున్నసుకం మన కెక్కణ్ణించొస్తుంది!' అనేది కోమటావిడ.

రోశాం అంట్లుతోమేది, దొడ్డిఊడ్చేది, బజారుకెళ్ళి అదీ ఇదీ పట్టుకొచ్చేది, బట్టలు ఉతికేది. అది ఉతికినబట్టలమీద నాలుగుచుక్కలు పవిత్రోదకం చల్లి మావాళ్ళు ఆరేసుకునేవాళ్ళు.

ఏ కారణంచేతనన్నా రోశాం ఒకరోజు రాకపోతే మావాళ్ళకి చాకిరి ఎంతచేసినా తెమిలేదికాదు. అయితే ఏం, దాన్ని అందరూ ఎంతో అపేక్షగా చూసేవాళ్ళు

మేం దానికి నెలకి పావలా ఇచ్చేవాళ్ళం సీతయ్యగారు యింకో పావలా అల్లా ఇచ్చేవాడు. కోమటాయన ఏమీ ఇయ్యకపోయినా రోశాం తల్లికి ఎప్పుడన్నా ఓ కమ్మిడీ ఉప్పుపెట్టేవాడు. రోశాం తండ్రికి ఒకటీ రెండూ అప్పుపెట్టి నెలకు రూపాయికి అణాకంటె వడ్డీ తీసుకునేవాడు కాదు, వ్యాపారం చేసుకునేవాళ్ళకిమట్టుకు అభిమానం ఉండవెట్టా?

ఎప్పుడన్నా మా యిళ్ళల్లో బాగా చిరిగిపోయిన బట్టలుంటే, అవతలపారెయ్యకుండా దానికే ఇచ్చేవాళ్ళం. తిండిపెడుతూనే ఉంటిమాయె ఇంక దానికి ఖర్చేముంది? ఏడాదికి నికరంగా ఆరురూపాయలూ వెనకేసిందన్నమాటే. ఈ లెక్కచూసి ఒసారి కోమటావిడ విరుచుకుపడిపోయినంత పనిచేసింది.

రోశాంతండ్రి వొట్టి పాపిష్టిముండాకొడుకు, తాగేసేవాడు. అందుచేత దానితల్లి, కూతురుజీతండబ్బులు మావాళ్ళదగ్గిరే దాచుకుని అవసరమై